## ఎన్నికల విధులకు లోబడి పని చేయాలి

దేవరకద్ర, అక్టోబర్ 13 : ఎన్నికల విధుల సంబంధించిన అధికారులు ఎన్నికల విధులకు లోబడి పనిచేయాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నటరాజ్, మండల ప్రత్యేక అధికారి రావీందర్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, వీడియో సర్వేలెన్స్ బృందాలు, వీడియో వింగ్ బృందాలు, ఎంసీసీ బృందాలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకౌంట్ రిజిస్టర్ల నిర్వహణ, అభ్యర్థుల వ్యయంపై అవగాహన కల్పించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున్న ప్రతి వ్యక్తి రూ.50వేలకు మించి తీసుకొపోకూడదని, ఎవరైనా అధిక డబ్బులు తీసుకోపోతే అందుకు సంబంధించిన పత్రాలను పరిశీలించాలన్నారు. ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ సర్వేలెన్స్ బృందాలు కమ్యూనిటీ హాల్స్, ఫంక్షన్ హాల్‌లను తనిఖీ చేశారు. అధికారులకు కేటాయించిన పనులను తప్పకుండా నిర్వహించాలని, ప్రతి రోజు నివేదికలను పూర్తి చేసి సమర్పించాలన్నారు. కార్యక్రమంలో డీటీలు శివరాజ్, ఆంజనేయులు, ఆర్ఐ సురేశ్, అధికారులు పాల్గొన్నారు.

## రైతులు బ్యాంకు అభివృద్ధికి తోడ్పడాలి

దేవరకద్ర, అక్టోబర్ 13 : సహకార కేంద్ర బ్యాంకు అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని డీసీసీబీ మేనేజర్ వెంకటరమణాచారి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో వివిధ వ్యాపారస్తులను బ్యాంక్ మేనేజర్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, కస్టమర్లు, వ్యాపారస్తులు తమ బ్యాంక్‌లో డిపాజిట్ చేసి ఇతర రైతులకు రుణాలు ఇచ్చేందుకు సహకరించాలన్నారు. అదేవిధంగా రైతులు బ్యాంకులో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. బ్యాంక్ పరిధిలోని గ్రామాల్లోని రైతులకు క్రాప్ లోన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలు



వ్రతాన్ని నిర్వహిస్తున్న మాతృమండలి సభ్యులు

భూత్పూర్, అక్టోబర్ 13 : పట్టణ కేంద్రంలోని రామలింగేశ్వరాలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకొని శుక్రవారం మాతృమండలి ఆధ్వర్యంలో గౌరీశంకరుల సామూహిక వ్రతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృమండలి సభ్యురాలు పుష్పమ్మ మాట్లాడుతూ లోకకల్యాణార్థం ఈ వ్రతాలను ప్రతి నెల మాస శివరాత్రి రోజు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు మంజునాథ్, సభ్యులు హేమలత, రాజేశ్వరి, శ్రీలత, సరస్వతి, శారద పాల్గొన్నారు.

## దంతనూరులో స్వచ్ఛభారత్

మదనాపురం, అక్టోబర్ 13 : గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని సర్పంచ్ శ్రావణి అన్నారు. శుక్రవారం మండలంలోని దంతనూరులో పంచాయతీ సెక్రటరీ విక్రమ్‌గౌడ్, ఉపాధిహామీ సిబ్బందితో కలిసి వివిధ కాలనీల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపుగా పెరిగిన ముళ్లపొదలను, పిచ్చిమొక్కలను తొలగించారు. రోడ్డు పక్కల చెత్తచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. గతంలో పల్లెప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాన్ని అన్ని విధాలుగా మెరుగుపర్చుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రావణి, కార్యదర్శి విక్రమ్‌గౌడ్ పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి పరామర్శ

కొత్తకోట, అక్టోబర్ 13 : మండలంలోని నాచారంపేట గ్రామ పంచాయతీ పరిధిలో పోల్కంపుడితండా ఏడో వార్డు సభ్యురాలు మిర్యాలమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, సర్పంచులు లావణ్య, చంద్రకళ శుక్రవారం పరామర్శించారు. ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.5వేల ఆర్థిక సాయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ దేవి లక్ష్మణ్‌నాయక్, చంద్రునాయక్, హనుమంతునాయక్, శేఖర్‌రెడ్డి ఉన్నారు.

# సుందరంగా గ్రామ పంచాయతీ భవనం

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), అక్టోబర్ 13 : తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న తర్వాత సీఎం కేసీఆర్ ముఖ్యంగా పల్లెల అభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళికను రూపొందించి గ్రామాలను పట్టణాలకు ధీటుగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు శ్రీకారం చుట్టారు. గ్రామాల అభివృద్ధికి గ్రామ పంచాయతీలు బాగుంటేనే అక్కడి వాతావరణంతోపాటు అన్ని బాగుంటాయని గుర్తించిన సీఎం కేసీఆర్, జనాభా ప్రాతిపదికన నూతన గ్రామ పంచాయతీలు, గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి ప్రజలకు పరిపాలన సౌలభ్యం మరింత చేరువ చేశారు. గ్రామంలో కొత్త గ్రామ పంచాయతీ భవనాలు నిర్మాణాలు చేపట్టేందుకు తగిన ప్రణాళికలు రూపొందించారు. ప్రతి మండలంలో నూతన పంచాయతీ భవనాలు అవసరమైన గ్రామాలను గుర్తించి కొత్త భవనాల నిర్మాణాలు చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ.22లక్షల చొప్పున మంజూరు చేసింది. కౌకుంట్ల మండల పరిధిలోని రాజోళి గ్రామంలో అధునాతన వసతులతో, సకల సౌకర్యాలతో నూతన పంచాయతీ భవనం నిర్మాణం పూర్తి చేసి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిచే ప్రారంభించారు. అలాగే వెంకంపల్లి, వెంకటగిరి, రేకులంపల్లితోపాటు చిన్నచింతకుంట మండలంలో పలు గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాల నిర్మాణాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. కౌకుంట్ల మండలం రాజోళి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం విలాసవంతమైన భవనానికి ధీటుగా సర్పంచ్ డోకూరు కృష్ణవేణి రామకృష్ణ దగ్గరుండి నాణ్యతలో రాజీలేకుండా భవనం పనులు పూర్తి చేయించారు. భవనం లోపల సర్పంచ్ చాంబర్, పంచాయతీ కార్యదర్శి చాంబర్ ఏర్పాటుతోపాటు, గ్రామ సభ సమావేశం నిర్వహించేందుకు సౌకర్యవంతంగా నిర్మించారు. ఖరీదైన ముఖ ద్వారం, తెలంగాణ లోగో తోపాటు ఇరువైపులా ర్యాంపులు నిర్మించారు.




నూతనంగా నిర్మించిన రాజోళి గ్రామ పంచాయతీ భవనం

### ఎమ్మెల్యే ఆల సహకారంతో భవన నిర్మాణం



కొత్తగా ఏర్పాటైన గ్రామ పంచాయతీకి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి గ్రామ పంచాయతీ భవనాన్ని మంజూరు చేయించారు. ఎమ్మెల్యే సూచనలను పాటిస్తూ, అధునాతనంగా పంచాయతీ భవనాన్ని నిర్మించడంతో మా గ్రామస్తులకు చాలా ఆనందంగా ఉంది. భవిష్యత్ తరాల కోసం సర్కార్ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందించడం సర్పంచులకు గర్వంగా ఉంది.

- కృష్ణవేణి, రాజోళి గ్రామ సర్పంచ్

# ఘనంగా బతుకమ్మ సంబురాలు



దేవరకద్ర : బతుకమ్మ ఉత్సవాలను జరుపుకొంటున్న విద్యార్థులు

కొత్తకోట, అక్టోబర్ 13 : పట్టణంలోని భారతి విద్యామందిర్‌లో శుక్రవారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో చైర్మన్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, శ్రీదేవి, సిద్ది విలాసిని, విద్యార్థులు పాల్గొన్నారు.

**భూత్పూర్‌లో..**

భూత్పూర్, అక్టోబర్ 13 : పట్టణంలోని సాహితీ పాఠశాలలో విద్యార్థులు బతుకమ్మ ఆట-పాటలతో సంబురాలను జరుపుకొన్నారు. శుక్రవారం పాఠశాలకు దసరా సెలవులు ఉన్నా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఈ వేడుకలను నిర్వహించుకొన్నారు. ఈ వేడుకలను మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ ప్రత్యక్షంగా తిలకించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సత్యం, ప్రధానోపాధ్యాయురాలు పర్వీన్‌బేగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**దేవరకద్రలో..**

దేవరకద్ర, అక్టోబర్ 13 : మండలంలోని చౌదర్‌పల్లి గ్రామ సమీపంలో స్వీట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం దసర ఉత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులు ఘనంగా బతుకమ్మ సంబురాలను నిర్వహించుకున్నారు. విద్యార్థులు బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా వివిధ రకాల పూలను పేర్చి బతుకమ్మను మధ్యలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బొడెమ్మలు వేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.



భూత్పూర్ : బతుకమ్మ వేడుకలను తిలకిస్తున్న సత్తూర్ బస్వరాజ్‌గౌడ్



కొత్తకోట : పాఠశాలలో బతుకమ్మ వేడుకలో పాల్గొన్న విద్యార్థినులు